కథానిక

# కొత్తరకం భ్రాతృత్వం

కొమ్మూరి వేణుగోపాలరావు

కాశీపతి హోటల్ గుమ్మంలోంచి బయటకు వచ్చాడు. అతనిశరీరంమీద సిల్కుచొక్కా, తెల్లప్యాంటూ ఎండకు నిగనిగ మెరుస్తున్నాయి. చేతిలో గోల్డుఫ్లాక్ సిగిరెట్ టిన్ ఒకటి వున్నది. అతన్నిచూస్తే ఎవరైనాసరే శ్రీమంతుడైన ఖులాసాపురుషుడు అనుకోకతప్పదు.

కాశీపతి నలువయిపులా ఒకసారి చూశాడు. "దగ్గరున్న డబ్బంతా నిండుకుంటున్నది. కొత్త బేరం ఏదయినా పట్టుకపోతే లాభంలేదు"అనుకున్నాడు సిగిరెట్ దమ్ముపీలుస్తూ.

అతను ముందుకు నాలుగడుగులువేసేసరికి ఒక దృశ్యం బాగా ఆకర్షించింది. ఆసక్తితో తననాకర్షించినవిషయాన్ని పరిశీలించసాగాడు.

అదేమీలేదు. ఒక ముష్టివాడు, చిన్నవాడే దారినిపోతున్న ఒక సేట్ ను వుద్దేశిస్తూ"అయ్యా ఒక కానీధర్మంచెయ్యండి"అని వేడుకున్నాడు.

ఆ సేటు వీడివంక పరిహాసంగాచూసి, "కానీ యివ్వాలేం? నీ అబ్బగాడిసొమ్మేమయినా తేరగా వుందనుకుంటున్నావా యిక్కడ?" అని రెండు మాటలు దులిపి చేతికర్రనాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

కాశీపతి ముష్టివాడిని చూసేసరికి జాలికలిగింది. అతనిదగ్గరకువెళ్ళి"ఏంతమ్ముడూ! ఆకలేస్తూందా?" అని అడిగాడు.

తనను యింతచనువుగా పలకరిస్తున్నది ఎవరా అని ముష్టివాడు విస్తుపోయి "అవునండీ బాబూ. మూడురోజులపట్టి నోట్లోముద్దపడలేదు"అన్నాడు వినయంగా.

"అరె. ఆకలిబాధ చాలచెడ్డదిసుమా. రారా. హోటల్లోకిపోదాం" అని కాశీపతి హోటలువయిపు తిరిగాడు. ఈ విచిత్ర మనస్తత్వం అర్థంగాక ముష్టివాడు అతనివెనకనే నడవసాగాడు.

ఇద్దరూ హోటల్లోకి ప్రవేశించారు. ఒక మూలకుపోయికూర్చున్నతర్వాత "నీ యిష్టంవచ్చినట్లుతిను తమ్ముడూ. ఏంకావాలి?"అంటూ అడిగాడు కాశీపతి.

తమ్ముడు కొంచెంగా సిగ్గుపడ్డాడు. సర్వర్ వచ్చి "ఏంకావాలి?"అని అడిగి అడగటంతోనే కాశీపతి జవాబిచ్చాడు: "మసాలదోశ, ఉప్మా, బోండా, యిడ్లీ, ఆఁ...యింకా ఏం కావాలి తమ్ముడూ?"అని అడిగాడు. సర్వర్ యీ చిరిగిన పేలికలు కట్టుకున్న ముష్టివెధవ యిన్ని తినటానికి అర్హుడేనా? అన్నట్లు వింతగాచూశాడు.

"చాలండీ!" అన్నాడు తమ్ముడు.

"బిడియపడబోకు తమ్ముడూ, తినటం విషయంలో సందేహిస్తే యింక అయినట్లే. ఆకలి దాచుకోకు"అన్నాడు ఆప్యాయంగాఅన్నయ్య. కాదు. కాశీపతి.

ఆర్డర్ చేసినవన్నీ ఒక్కొక్కటిగావస్తున్నాయి. తమ్ముడు తన ఆకలిబాధ తీర్చుకుంటూంటే కాశీపతి అతన్ని కబుర్లలోదించాడు.

"నీకెవ్వరూలేరా తమ్ముడూ?"

"అమ్మవుంది. ఆమెకూడా ఎక్కడో అడుక్కుంటూ వుంటుంది" అని జవాబిచ్చాడు తమ్ముడు.

"నువ్వేమయినా చదువుకున్నావా?"

"థర్డుఫారందాకా చదువుకున్నానండీ. ఆ తర్వాత నాన్నపోయాడు. అప్పట్నుంచీ అమ్మా నేనూకలిసి అడుక్కుంటున్నాము."

కాశీపతిముఖం వికారంగాపెట్టాడు. "అడుక్కోవటం! ఇంతకంటే మంచిమార్గం దొరకలా ఎవరికీ?"అన్నాడు తన మాటలో అయిష్టం ధ్వనిస్తూండగా.

"మీరేం చదువుకున్నారు?"

"చదువా? ఆ విషయం ఎందుకుగాని, నీకేం కావాలంటే ఆ భాషలో మాట్లాడుతాను.

ఇంగ్లీషు, హిందీ, అరవం, యింకా...అంటూ ఆయాభాషలలో గడగడమాట్లాడిచూపించాడు.

తమ్ముడు నిశ్చేష్టుడయ్యాడు అతగాడి ప్రావీణ్యతకు. "మీరేంచేస్తారండీ?"అని అడిగాడు తరువాత.

ఈసారి కాశీపతికళ్ళలో కాంతి మెరిసింది. "ఒకటేమిటి? డబ్బుసంపాదించటానికి అనువైన పనులన్నీ చేస్తాను. ఒక ట్రిక్కు వేశానంటే డబ్బు గలగలమని రాలిపోవాలి. అలాగని ఉద్యోగం కాదుసుమా తమ్ముడూ''అని చెప్పాడు.

ఈ సంబోధనవింటే తమ్ముడివళ్లు పరవశం చెందుతూంది."అంటే అదెలాగండీ అన్నయ్యా" అన్నాడు చటుక్కున. తరువాత నాలుక కొరుక్కున్నాడు.

"అలా బాగుంది. పిలిచావు. అదెలాగని అడిగావు కదూ. నీకు చెప్తే అర్థంకాదు. ఇవాళంతా నావెంట వుండు. ఒక గమ్మత్తుచేసి చూపిస్తాను. ముష్టిలో ఏముంది? మూడుగంటలసేపు అరుచుకుంటే మూడుకాన్లు రావు" అన్నాడు కాశీపతి. తమ్ముడు తెల్లబోయాడు.

తరువాత కాశీపతి ముందుకువంగి మెల్లిగా ఇందాక నువ్వు కానీ యిమ్మని అడిగితే చీదరించుకుని పోయాడే వాడిపేరు మిలాప్‌చంద్. వాడి భరతం పడతానివాళ. వాడు వజ్రాల వ్యాపారం చేస్తాడులే'' అని చెవిలో వూదాడు.

ఈలోగా తమ్ముడు టిఫిన్ తీసుకోవటం ఆయిపోయింది. తరువాత అతని వెంటబెట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు కాశీపతి.

*   *   *

తమ్ముడ్ని తన యింటికి తీసుకుపోయాడు కాశీపతి. ఇలు ఏమంతడాబు సరిగాలేదు. చిన్న యిల్లే. కాశీపతి వేషధారణ చూసినవాళ్లెవరూ అటువంటి యింట్లో వుంటాడని అనుకోరు.

"తమ్ముడూ. నువ్విలా వుండటం నాకేం బాగుండలేదు. డబ్బు లేకపోయినంత మాత్రాన చిరిగిన పేలికలు కట్టుకుని పెరిగిన గడ్డంతో వుండాలని నియమం వుందా? నిన్ను సాంతం మార్చివెయ్యాలి."అంటూ తమ్ముడికినచ్చజెప్పాడు కాశీపతి.

మరోగంటలో తమ్ముడి రూపం మారిపోయింది. చిరిగిన పేలికలు మూలకుచేరాయి. పెరిగిన గడ్డంపోయి బుగ్గలు, గడ్డం నున్నగా తయారయాయి. కాశీపతి ప్యాంటు, చొక్కా అతనికి బదిలీ అయాయి. తమ్ముడు పాతరూపం మారిపోయి అచ్చం ఒక విలాస పురుషుడిలా తయారయ్యాడు. అద్దంలో తనరూపం చూసుకుని తనే విస్తుపోయాడు.

కాశీపతి అతన్ని చేర పిలిచాడు. దగ్గరకువచ్చి కూర్చున్న తర్వాత"తమ్ముడూ మనం మిలాప్‌చంద్‌గాడి దగ్గర ఓనాటకం ఆడాలి. నువ్వేమీ భయపడబోకు సుమా. నేను నీకంతా బోధపరుస్తానులే" అంటూ చెవిలో చాలాసేపు గుసగుసలాడాడు.

తమ్ముడికి కొంచెం భయంగానేవుంది లోపల. అయినా కాశీపతి ధైర్యంచూసి "సరే అన్నయ్యా మీయిష్టం" అని అనక తప్పలేదు.

ఆ మధ్యాహ్నం కాశీపతి తమ్ముడుతో "తమ్ముడూ-ఒక అరగంటదాకా వంటరిగా గడపాలి నువ్వు. నేను యిప్పుడే బయటకు పోయి వస్తాను" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు. తమ్ముడు ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

సరిగ్గా అరగంట గడిచేటప్పటికి కాశీపతి తిరిగి వచ్చాడు. వస్తూనే జేబులోంచి ఒక వజ్రహారం బయటకు తీశాడు.

"ఇదెక్కడిది అన్నయ్యా, దొంగవజ్రాలా?" అన్నాడు తమ్ముడు.

"దొంగవజ్రాలా? చూడు ఎలా మెరిసిపోతున్నాయో?" అంటూ దానిని అటూయిటూ కదిలించాడు కాశీపతి. లోపలకు పడుతున్న ఎండలో అది తళతళమని మెరిసింది.

"చూశావా? ఇది అసలయిన వజ్రాలహారం. నాస్నేహితుడైన ఒక డాక్టర్ని అడిగి తెచ్చాను."

తమ్ముడు మరింతగా ఆశ్చర్యపోయాడు. "మిమ్మల్ని నమ్మి యింత విలువగల హారం యిచ్చాడా అన్నయ్యా?" అనడిగాడు.

"అదే గమ్మత్తు. నా స్నేహితులంతా డాక్టర్లూ, ప్లీడర్లే తెలుసా? ప్రాణం యిస్తారు. నేనిటువంటిపని చేస్తానని కలలోకూడా నమ్మరు. ఇంత ఆర్భాటం లేకపోతే నా యెత్తు లెలా సాగుతా యనుకున్నావేం?" అన్నాడు సగర్వంగా కాశీపతి.

"అట్లయితే అన్నయ్యా, ఏమని సాకుచెప్పి దీన్ని తెచ్చావు?"

"నేను ప్రేమించిన ఒక యువతికి కానుకగా యిద్దామనుకుంటున్నాను ఒకహారం. మొన్న నువ్వుకొన్న హారం ఒకసారి ఇవ్వవోయి" అన్నాను అంతే. తక్కున తెచ్చిచ్చేశాడు. ఐతే మరి నువ్వు రెడీఅవు" అంటూ తొందర చేశాడు కాశీపతి.

మరో అరగంటకల్లా యిద్దరూ ఇల్లు తాళం పెట్టి బైటికి బయలుదేరారు. వెళ్ళేటప్పుడు ఏదో వస్తువుతీసి పదిలంగా జేబులో వేసుకున్నాడు కాశీపతి.

* * *

సాయంత్రం అయిదుగంటలయింది. షరాబు బజారంతా సందడిగా వుంది

కాశీపతి ఒక్కడూ మెల్లిగా ఆ బజారులో నలువయిపులా పరిశీలిస్తూ వస్తున్నాడు. మరెందుకోగాని రెండుమూడుసార్లు అక్కడున్న వజ్రాల షాపుల్లోకి వెళ్ళి వాళ్ళతో కొంతసేపు మాట్లాడి బయటకు వచ్చాడు. తర్వాత అతను మిలాప్‌చంద్ షాపులోకి వెళ్ళాడు.

అప్పుడే ఏదో బేరం ముగించి ఎవరినో సాగనంపుతున్న మిలాప్‌చంద్ యీ గంతకుణ్ణి చూసి "రండి రండి" అంటూ లోపలికి ఆహ్వానించాడు. కాశీపతి అక్కడున్న కుర్చీలో కూర్చుని అతనితో మాట్లాడుదామని తలపైకెత్తి చూశాడు.

"ఎలాంటి వజ్రాలు కావాలిసార్? ఏయ్! ఆ బీరువాలోవున్న ఫస్టుక్వాలిటీ డైమండ్సు తీసుకురా" అంటూ తన ప్రక్కనే నిల్చునివున్న మరొకడ్ని ఆజ్ఞాపించాడు మిలాప్‌చంద్.

"ఆ. ఆ. నేను డైమండ్సు కొనడానికికాదండీ వచ్చింది. నాదగ్గరున్న డైమెండ్ నెక్లస్ అమ్ముదామని..."అంటూ జేబులోంచి అది పైకితీశాడు కాశీపతి.

మిలాప్‌చంద్ దాన్ని అందుకుని పరిశీలించి ఇంత కొత్తది, అప్పుడే అమ్మేస్తున్నా రేం?" అని అడిగాడు.

"ఈ ఆడవాళ్ళతో చచ్చే చావొచ్చిపడింది. ఏంచెయ్యమంటారు? మొన్ననే దీన్ని లాల్‌చంద్ షాపులో కొన్నాను ఎనిమిది వేలకి. యిప్పుడు మళ్ళీ యిది వద్దట. ఏంచేస్తాం తిరిగి అమ్మేద్దామని వచ్చాను."

"ఆ లాల్‌చంద్‌కే యిచ్చేసెయ్యలేకపోయారూ తిరిగి?"

"అదే. ఆ వుద్దేశంతోనే వెళ్ళాను. అయితే మా యిద్దరికీ సరిగ్గా బేరం కుదరలేదు. ముందు యిది డైమండ్సోకాదో చూసుకోండి"అన్నాడు కాశీపతి.

"అహహా. తమలాంటివారు తెచ్చినవి వేరే చూడాల్నండీ!" అంటూనే మిలాప్‌చంద్ ఆ వజ్రాలు మంచివో కావో అక్కడున్న పరికరాసహాయంతో చూడసాగాడు.

పదినిమిషాలయింతర్వాత తలయెత్తి"ఇవి అసలయిన డైమండ్సే మరి. అయితే దీని విలువ మాత్రం మునుపటి మాదిరిరాదు"అన్నాడు.

"అంటే?"

"అంటే మీరు కొన్నప్పటి ధరరాదు అంటున్నాను. ఆరువేల అయిదువందలు ఇస్తాను నేను."

"ఆరువేల అయిదువందలా? ఇది లాల్‌చందే యిస్తానన్నాడు కదండీ"అన్నాడు కాశీపతి.

ఇంతలోనే బయట బూట్లచప్పుడు వినిపించింది. మిలాప్‌చంద్ తలయెత్తి చూశాడు. ఆ సమయానికి తమ్ముడు లోపలికివస్తున్నాడు. ఉదయము తనను కానీ యిమ్మని అర్థించింది ఆతమ్ముడేనని యీ షరాబుకేం తెలుసు? "రండి రండి" అంటూ ఆహ్వానించాడు. తమ్ముడు లోపలికివచ్చి కుర్చీలో కూచున్నాడు.

"తమకేం కావాలి సార్?"

"డైమండ్ నెక్లస్ కావాలండీ. తమవద్ద మంచివి దొరుకుతాయా?" అనడిగాడు తమ్ముడు ఠీవిగా.

"ఓ" అంటూ ప్రక్కనున్నవాడిని పిలిచి డైమండ్ నెక్లస్‌లు తీసుకురమ్మని పురమాయించాడు యజమాని. మూడు నిమిషాలలోకల్లా కళ్లు జిగేలుమనిపిస్తూ అవి వచ్చాయి. తమ్ముడు వాటిని తీసి పరిశీలించసాగాడు. తమ్ముడి చెయ్యి కొంచంగా వొణకటం కనిపెట్టాడు ఓరకంటితో చూస్తున్న కాశీపతి.

తమ్ముడు అన్ని వజ్రాలు పరిశీలిస్తున్నాగాని అతనికి ఒక్కటీ నచ్చటంలేదు. ప్రతిదాన్ని తీ

చూసి "ఏఖిటో యీ మోడల్ అంతగా, నచ్చటము లేదు"అని అనటం మొదలు పెట్టాడు.

"పోనీ యిది నచ్చుతుందేమో చూడండి" అంటూ తనచేతిలోవున్న నెక్లెస్‌ను అందిచ్చాడు కాశీపతి తమ్ముడికి. తమ్ముడు అందుకుని దాన్ని పరీక్ష చెయ్యసాగాడు. "అబ్బా" అన్నాడు బాధతో కాశీపతి తల క్రిందికి దించుకుని హఠాత్తుగా.

"ఏమిటి? ఏమయింది?" అని కొట్లోవున్న ముగ్గురూ కాశీపతి కాలివంక చూశారు. అతను కొట్లోకి వచ్చింతర్వాత కాలినున్న బెల్టుబూటు వూరికినే విప్పేశాడు. ఆ పాదం పైని పొట్టురేగి రక్తం చిమ్మింది. దుకాణదార్లు ముగ్గురూ క్రిందినుంచి చూపు పైకి మరల్చుకునే లోపలే కాశీపతీ, తమ్ముడూ కలసి ఏదో గారడీ చేశారు.

"పర్వాలేదులెండి. ఏదో చిన్న దెబ్బ" అన్నాడు బూట్సులు తొడుక్కుంటూను కాశీపతి.

"నాకు యిదికూడా అంతగా నచ్చలేదండీ. తీసుకోండి. ఇంకోకొట్లో విచారిస్తాను. వెళ్తున్నానండీ షరాబ్‌జీ" అంటూ తనచేతిలోవున్న డైమండ్ నెక్లెస్ కాశీపతికి యిచ్చేసి బయటకు వెళ్లిపోయాడు తమ్ముడు.

మిలాప్‌చంద్ కొంచంగా విసుక్కున్నాడు బేరంపోయినందుకు. "చెప్పండి ఎంతయిస్తారో" అన్నాడు కాశీపతి.

"చెప్పాను కదండీ. అంతకన్నా ఎక్కువ యివ్వలేను" యిద్దరూ కొంతసేపు వాదులాడుకుని చివ్వరికి ఆరువేల ఆరువందలకి బేరం సెటిల్ చేసుకున్నారు. "ఇదిగో చూసుకోండి" అంటూ తనడైమెండ్ నెక్లెస్ పెట్టెతోసహా యిచ్చేశాడు కాశీపతి.

"ఎన్నిసార్లు చూడాలిసార్? తమలాంటివార్ని ఎన్నిసార్లు అనుమానిస్తాం?" అంటూనే ఆహారాన్ని ఒకసారి చేతితో తడిమిచూసుకుని లోపల పెట్టుకున్నాడు మిలాప్‌చంద్. తర్వాత పదినిమిషాల్లోనే తనకు రావల్సిన డబ్బు తీసుకుని బయటకి వచ్చేశాడు కాశీపతి.

అనుకున్న ప్రకారం యిద్దరూ గాంధీపార్కు గేటుదగ్గర కలుసుకున్నారు కాశీపతీ, తమ్ముడూను.

"ఏమయింది?" అన్నాడు ఆరాటంగా తమ్ముడు.

"ఈ కాశీపతి దెబ్బకి తిరుగులేదు తమ్ముడూ. నాచేతిలో ఎంతమహిమ వున్నదీ చూశావుగా యిందాక. పద యిక్కడెందుకు?" అన్నాడు కాశీపతి. ఇద్దరూ అక్కడినుంచి పోయి కాశీపతి యింటికి చేరుకున్నారు.

కాశీపతి డబ్బులెక్కవేసి తమ్ముడిచేతిలో రెండువేలు పెట్టాడు. నేర్చుకో తమ్ముడూ. యింకెప్పుడూ ముష్టెత్తబోకు. కడుపు మాడ్చుకోవడంతప్ప వేరే ప్రయోజనం లేదందులో. చూశావుగా. ఒక్కఎత్తుకు ఎన్నివేలు రాలాయో. వాడికిచ్చింది అసలయిన హారమే అనుకున్నాడు షరాబు. అసల్ది నీద్వారా వెళ్లిపోయి దొంగవజ్రాల్ది వాడికొచ్చిందని వాడికేంతెల్సు? అలాగని ఎప్పుడూ యిదేమంత్రం ఉపయోగించబోకు. దెబ్బతింటావు. ఇంకా అనేకరకాలు. తీరికవున్నప్పుడురా అన్నీ నేర్పిస్తాను పాపం మీఅమ్మ కనిపెట్టుకు వుంటుదేమో యింక వెళ్ళు" అని బోధచేశాడు కాశీపతి.

సెలవు పుచ్చుకుని బయలుదేరాడు తమ్ముడు. "దొంగతనం యింత సులభంగావుందే. అయితే ఇంతమందిముష్టివాళ్లువున్నారెందుకో. వాళ్ళంతా ఎందుకని దొంగతనంచేసి బాగుపడరో? అయినా అంతాయిదే అవలంభిస్తే యింకముష్టి ఎత్తేది ఎవరు?" అనుకుంటూ సాగిపోయాడు తమ్ముడు.

"శ్రీమతి విశాలాక్షి చాలా చక్కని నాట్యగత్తె."
"అంటే నీ ఉద్దేశం ఆమె నాట్యం చక్కగా చేస్తుందనా?"
"ఎంతమాత్రం కాదు."